RNI NO. APTEL/2014/58326

నవతరం తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 131 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

22-03-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4

# అరసవల్లి క్షేత్రానికి మహర్దశ...





- రూ. 4 కోట్లతో పుష్కరిణి పునరుద్ధరణ
- శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రసాద్ స్కీమ్ ద్వారా రూ. 58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంతోనే ఆధ్యాత్మిక వైభవం కేంద్ర మంత్రి






**నవతరం -శ్రీకాకుళం**

ప్రపంచ దేశాల నుంచి భక్తులు తరలివస్తున్న ప్రసిద్ధ అరసవల్లి క్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం ద్వారా రూ. 58 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు.

## రూ. 58 కోట్లతో మెగా మాస్టర్ ప్లాన్

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి క్షేత్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఇప్పటికే పుష్కరిణి పనులకు రూ. 4 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం కింద మరో రూ. 58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వంటశాల, భోజనశాల, భక్తుల కోసం వసతి గృహాలు, విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అరసవల్లి రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నాటి నుంచి భక్తుల తాకిడి గణనీయంగా పెరిగిందని, దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని మంత్రులు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విశాలమైన రహదారులు, సెంటర్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక హబ్‌లుగా మార్చడమే లక్ష్యమని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి కూటమి హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఐక్యత సందేశంగా రంజాన్... జమియా మసీదులో ఎమ్మెల్యే గొండు శంకర్

- భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహణ
- శాంతి, సౌహార్దం, సహనానికి పండుగగా రంజాన్ సందేశం



**నవతరం -శ్రీకాకుళం**



సూర్య మహల్ జంక్షన్‌లోని జమియా మసీదులో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ పర్వదినం శాంతి, సౌహార్దం, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోహన్ కృష్ణకు టీడీపీ కార్యాలయంలో ఘన నివాళులు



**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం టీడీపీ కార్యాలయంలో దీర్ఘకాలం మేనేజర్‌గా సేవలందించిన మోహన్ కృష్ణ మరణంపై శనివారం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, మోహన్ కృష్ణ పార్టీకి అంకితభావంతో పనిచేసిన ఆదర్శ వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు పి. మాధవి తదితరులు పాల్గొన్నారు.

# మోప్మా కార్యక్రమాలపై మంత్రితో చర్చలు

- అచ్చెన్నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన పీడీ శైలజ
- పేదల సంక్షేమం, మహిళా సంఘాల బలోపేతంపై చర్చ



**నవతరం -నిమ్మాడ**

మోప్మా పీడీ బొడ్డేపల్లి శైలజ శనివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పేదరిక నిర్మూలన, మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన, యువత ఉపాధి అవకాశాల పెంపు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మోప్మా పథకాలు పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని వివరించారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మోప్మా కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

ఎడిటోరియల్

# ఆయనే వుండి..!

బ్రహ్మదేవునికి మన పర తేడాలేముంటాయి?!
ట్రంప్ మహాశయుని నుదట 'నోబెల్' అనే మూడక్షరాలు రాసిపడేసి వుంటే ఈ పాటికి ఇరాన్‌లోనేమిటి, సమస్త భూమండలంలో దీపావళి పండుగ జేసుకుంటూండే వాడే! పహల్గాం ఘటన తర్వాత కత్తులు దూసిన భారత్, పాక్ సేనలను తానే అదుపు చేశానన్న ఆనందంలో నోబెల్ శాంతి బహుమతి రక్తపిపాసులక్కూడా ఇస్తారన్న పైత్యం ప్రకోపించి "ప్రాణాలు కాపాడటం అంటే నాకు చాలాఇష్టం. ప్రాణాలు కాపాడుతుంటే చివరికి ఒక శాంతిమయ ప్రపంచంలో మనముంటామని మీరు అర్థం చేసుకోండి" ప్రపంచ ప్రజలకు ట్రంపోపాఖ్యానమది!
ట్రంప్ ముఠా చేతులు రక్తమోడుతున్నాయి. ఒక 2025లోనే వెయ్యిమంది ట్రంప్ సైన్యం చేతిలో హతమైనట్టు లెక్కలున్నాయి. రాయిటర్ సర్వేలో నలభైశాతం మంది అమెరికన్ పౌరులు ఈ "శాంతి దూత" తమకెక్కడ దొరికాడురా అని నెత్తి బాదుకుంటున్నారు.
రాజుల కోసం, రాజ్యాల కోసం నాటి కురుక్షేత్ర యుద్ధం జరిగితే, పెట్టుబడిదార్ల కోసం, వారి లాభాల కోసం నేటి చమురు క్షేత్ర యుద్ధం వారి కాపలాకుక్కలు చేస్తున్నాయి. అన్నింటిలో బలయ్యేది సామా న్యులే! యుద్ధాల్లో మంచి, చెడుల్లేవు. దాన్ని గ్రహించిన అనేకులు, అమెరికాతో సహా, అనేక దేశాల్లో యుద్ధాల్లో తాము పాల్గొనం అని చేస్తున్న జనాగ్రహం పెచ్చరిల్లుతోంది.
ఒక స్వతంత్ర దేశాధిపతిని ఆయన భార్యతో సహా ఈడ్చికెళ్లి తమ దేశంలో విచారణ జరపడం, మరో స్వతంత్ర దేశం ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించి అధినేతను అంతం చేయడం, వెనిజులా నుండి చౌకగా పెట్రోలియం ఉత్పత్తులు అందుకునే క్యూబా గొంతు నులిమేందుకు ప్రయత్నించడం, ప్రపంచానికి సోషలిస్టు ప్రత్యామ్నాయాన్ని అందకుండా చేయడం ఇదొక 'త్రిముఖ వ్యూహం'. ఒకదానికొకటి అంతఃసంబంధమున్న అంశాలివి. ఇది ట్రంపోన్మాదమని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. చరిత్ర పుటల్ని తిప్పిచూస్తే సరిగ్గా 200 ఏండ్ల క్రితం, 1823 నాటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో అమెరికావైపు తిరిగి చూడకుండా మిగిలిన ఐరోపా దేశాలకు ఇచ్చిన వార్నింగది! తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు, నేడు దీన్నే 'హైపర్ ఇంపీరియలిజం' అని విజయ ప్రసాద్ వంటి మేధావులంటున్నారు.
అత్యంత అరుదైన (రేర్) ఎర్త్‌ఎలిమెంట్స్ పుష్కలంగా వున్న నెదర్‌ల్యాండ్స్ అధీనంలోని గ్రీన్‌ల్యాండ్‌పై దాడి చేస్తానన్న ప్రకటన, తన పొరుగునే ఉన్న కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేసుకుంటానన్న ప్రకటన ఒకటి నాటి నాటో దేశంపై యుద్ధం చేస్తాననడం, మరొకటి మొట్టమొదటి ఫ్రీట్రేడ్ ఒప్పందాన్ని (నాఫ్తా) నార్త్ అట్లాంటిక్ ఫ్రీ ట్రేడ్‌ను కాలరాయడం ట్రంప్ వేస్తున్న సుంకాలు పెట్టుబడిదారీ విధాన స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకే భిన్నమైనవి. వాస్తవానికి ప్రపంచీకరణ ఉందా? చచ్చిందా? అన్న సందేహం అనేక మందికి వస్తోంది!
వాస్తవానికి, నేటి అమెరికన్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో నుండే ట్రంప్ నేతృత్వం వచ్చింది. అతని విధానాలొచ్చాయి. తమదేశ సార్వభౌమత్వాన్ని నిలదొక్కుకోవాలనుకునే ఇరాన్ లాంటి మత రాజ్యమైనా, బొలివేరియన్ విప్లవ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న వెనిజులా లాంటి దేశాలైనా, చైనా, క్యూబా వంటి సోషలిస్టు దేశాలైన ఈ భూమండలంలో లేకుండా చేయాలనేది అమెరికా పన్నాగం.
ఈ విషయాన్నే మొన్న మ్యూనిచ్‌లో జరిగిన (తమ) భద్రతాసభలో అమెరికా విదేశాంగ మంత్రి మర్కోరూబియో "మనం రెండవ కొలంబస్‌యుగంలోకి ప్రవేశించాలి" అన్నాడు. తమ శత్రువులు పశ్చిమదేశాల సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేస్తున్నాయన్నాడు. భగవంతుడ్ని తిరస్కరించే కమ్యూనిస్టులవల్లనూ, వలస వ్యతిరేక పోరాటాల వల్లనూ సుత్తీ కొడవలున్న ఎర్ర దుప్పటి కప్పేస్తున్నాయని వాపోయాడు. తమ సార్వభౌమత్వాన్ని నిలదొక్కుకునే వారు, తమకు ఎదురుతిరిగేవారు, ఆ 'రోగాన్ని' ఇతరులకు అంటించే వారు ప్రమాదకారులన్నాడు.
ఖండాంతర వాసెవడో, మరో ఖండాంతర వాసిని కిడ్నాప్ చేస్తే మనకేమి? గ్రహాంతరాల్లో నుండి మరొకడ్ని ముక్కలు చేస్తే మనకేమి? అనుకునేవారు మన దేశంలో పుష్కలంగా ఉన్నారు! నేడు యుద్ధం మన వంటింట్లోకి వచ్చింది. రోడ్డు పక్కన ఇడ్లీలమ్ముకునే బండిపై బాంబులు పడ్తున్నాయి. స్విగ్గీ, జొమాటో సరఫరాదారుల ఉపాధిపై ప్రభావం పడింది. రూపాయి బిళ్ల దొల్లుకుంటూ కిందికిపోతూనే ఉంది. పెరిగే ధరలకు అడ్డుకట్ట వేసే మార్గాలు మోడీ దగ్గరున్నాయా? చౌకగా దొరికే ఇరాన్, రష్యా చమురును మన దేశం ఎందుకు తగ్గించుకుందో మోడీ సర్కారు సమాధానం చెప్తుందా? చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు కుదేలు ఎందుకవుతున్నాయో చెప్పగలదా ఈ ప్రభుత్వం? కోట్లాదిమందికి ఉపాధి పోతూంటే అడ్డుకోగలదా? పొంచి వున్న ఎరువుల సంక్షోభం మాటేంటి సార్? ఈ సర్కార్ ఫాసిస్టు పద్ధతులకు ఒడిగడ్తే సినారే మాటలే మనకి బాట!

# యువతకు ఉద్యోగాల కల్పనలో మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- నిరుద్యోగులకు అండగా జాబ్ క్యాలెండర్
- టిడిపి కోటబొమ్మాళి పట్టణ నేత మజ్జి కృష్ణారావు

నవతరం -కోటబొమ్మాళి



రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఉగాది పండుగను పురస్కరించుకొని జాబ్ క్యాలెండర్ ప్రకటించి.. ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని టిడిపి కోటబొమ్మాళి పట్టణ నేత మజ్జి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన కోటబొమ్మాళి లో మాట్లాడుతూ,నిరుద్యోగుల ఆశలను వమ్ము చేయకుండా పారదర్శకమైన రీతిలో ఉద్యోగుల భర్తీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. 20 నెలల స్వల్ప కాలంలోనే 6,28,347 మందికి యూదు రంగాల్లో ఉపాధి కల్పించిందని వివరించారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగాలు 30,607, ఎం ఎస్ ఎం ఈ రంగం ద్వారా 2,48,906 జాబ్ ఫెయిర్స్,స్కిల్ డెవలప్మెంట్ ద్వారా1,46,627, పరిశ్రమల రంగంలో 95,174 మందికి లబ్ధి చేకూరిందన్నారు. పరాభవ నామ సంవత్సర కానుకగా ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ లో పరిపాలన విభాగంలో గ్రూప్-1, గ్రూప్-2 కింద 600 పోస్టులు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం 1000 పోలీస్ కానిస్టేబుల్స్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు పచ్చ జెండా ఊపినట్లు ఆయన వెల్లడించారు. ఇక గ్రంథాలయాల చరిత్రలో చాలా కాలంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గత ప్రభుత్వం భర్తీ చేయలేదని,మంత్రి నారా లోకేష్ నాడు ఇవ్వగలం సందర్భంగా 20 లక్షల ఉద్యోగాల కల్పన మాటను నెరవేర్చుకునే దిశలో భాగంగా, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లైబ్రరీ పోస్టులను జాబ్ క్యాలెండర్ లో పెట్టి గ్రంథాలయాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేసినందుకు సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు మజ్జి కృష్ణారావు తెలియజేశారు.

# "నేత్రదానం" మరొకరి జీవితానికి వెలుగు

- రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

నవతరం -శ్రీకాకుళం



"నేత్రదానం" మరొకరి జీవితానికి వెలుగు అని, రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ స్థానిక మండలవీధికి చెందిన ఊన్న . గోవింద రావు 74 సంవత్సరాలు తనువుచాలించారని, వారి నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవటం మహోత్తర ఆలోచనని, కుటుంబ సభ్యులు కుమార్తె బరాటశీ.ధనలక్ష్మి, అల్లుడు బి. ప్రభాకర్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. నేత్ర సేకరణలో భాగముగా మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి.సుజాత, పి.చిన్ని కృష్ణ ల ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారన్నారు. సహకరించిన కుటుంబ సబ్యులకు పేరు పేరునా కృతజ్ఞతలని, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన అవసరమని, ఈ విధంగా ఒకరి నేత్రదానం ద్వారా, మరొకరు ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేత్ర దానం చేయాలనుకునే వారు 78426 99321 నంబరుకు సంప్రదించాలన్నారు.

# ప్రాంగణ నియామకాలతో అదిత్య కళాశాల విద్యార్థుల సత్తా

- 600కి పైగా ఉద్యోగాలతో రికార్డు
- డిగ్రీతోనే అధిక పారితోషకాలు సాధ్యం: ప్రిన్సిపాల్

నవతరం -శ్రీకాకుళం





అరసవల్లి కూడలి వద్ద ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలను సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ బి.ఎస్. చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె. శివశంకర్ మాట్లాడుతూ, డిగ్రీ పూర్తికాకముందే 636కు పైగా కార్పొరేట్ ఉద్యోగాలు సాధించడం విశేషమన్నారు. ప్రతి విద్యార్థి ఒకటి కంటే ఎక్కువ నియామకాలు పొందుతూ విద్యావ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.
డిగ్రీతోనే మంచి పారితోషకాలు లభిస్తున్నాయని, తల్లిదండ్రులు పిల్లలను డిగ్రీ చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. వేణు, ప్లేస్మెంట్ అధికారి ఎల్. ప్రసాదరావు పాల్గొన్నారు.

# యువతకు భారీ ఊరట...

- జాబ్ క్యాలెండర్‌పై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందన
- 6.28 లక్షల ఉద్యోగాలతో యువతకు కొత్త ఆశలు
- పారదర్శకంగా నియామకాలు జరగాలని సూచన

నవతరం -పలాస



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించారు. మొత్తం 20 లక్షల ఉద్యోగాల భర్తీ లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించగా, ఇందులో తొలి విడతగా 6,28,347 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.
గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్, టీచర్ తదితర విభాగాల్లో నియామకాలు చేపట్టడం యువతకు మంచి అవకాశం అని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇది ఊరటనిచ్చే చర్యగా అభివర్ణించారు.
పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నియామకాలు జరగాలని, అర్హులైన ప్రతి అభ్యర్థికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగాల భర్తీతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.
యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# అది జాబ్ క్యాలెండర్ కాదు.. డూప్ క్యాలెండర్..

- నిరుద్యోగులకు కూటమి దగా
- వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

నవతరం -పలాస



అది జాబ్ క్యాలెండర్ కాదు.. దూప్ క్యాలెండర్ అని, జాబ్ క్యాలెండర్ పేరుతో మరోసారి నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మోసగించిందని, ముఖ్యంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించారని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు విస్మయం చెందారు. శనివారం పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండుగ రోజున నిరుద్యోగులకు సంబంధించి ప్రకటించిన జాబ్ క్యాలెండర్ లో నిరుద్యోగులకు కొత్తగా కల్పించేలా లేకపోవడంతో పాటు ఇందులో ప్రకటించిన పోస్టులు అతి స్వల్పంగా ఉండడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొన్నదని బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన యువగలం పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్' మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరి నెలలో మెగా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు 21 నెలలు గడిచిన తర్వాత, ఉగాది రోజున 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వీరిలో చాలామంది భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయన్న ఆశతో వివిధ ప్రాంతాలలో కోచింగ్ సెంటర్ల ద్వారా కోచింగ్ పొందుతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను చూసిన వెంటనే నిరుద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురైందని, వాళ్ల భవిష్యత్తుపై ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ జాబ్ క్యాలెండర్ ను పరిశీలిస్తే, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులను మినహాయిస్తే,మిగిలిన వాటిలో నిరుద్యోగులకు పెద్దగా అవకాశాలు కనిపించడం లేదన్నారు. గత నోటిఫికేషన్లు పూర్తి చేయకుండానే కొత్త ప్రకటనలు చేయడం నిరుద్యోగుల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొన్న దన్నారు. సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు ఈ నోటిఫికేషన్ తో తీవ్ర నిరాశకు గురయినారని ఆయన పేర్కొన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగులతో ఓట్లు వేయించుకున్నారని, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగుల జాబ్ క్యాలెండర్ ద్వారా కనీసం 40 నుంచి 50వేల ఉద్యోగాలు భర్తీ నోటిఫికేషన్ వస్తుందని ఆశతో ఎదురు చూడగా వారి ఆశలను అడియాసలు చేశారని ఆయన విమర్శించారు. ప్రస్తుత జాబ్ క్యాలెండర్ లో పాఠశాల/ ఇంటర్ విద్యకు 3004 పోస్టులు కేటాయించారని, ఇందులో డీఎస్సీ కింద వచ్చే ఉపాధ్యాయ పోస్టు ఎన్ని అని ఆయన ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే 50వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రభుత్వం ప్రకటించాలని, అలాగే నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని బమ్మిడి దుర్యోధనరావు కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# నీ కోసం పూసిన నేను...

**ఒక చిన్న కథ – భావోద్వేగానికి ప్రతిబింబం**

ఒక చిన్న పట్టణం చివరలో ఉన్న పాత ఇంటి పైకప్పుపై ఒక చిన్న మొక్క పెరిగింది. ఆ మొక్కకు "మాలతి" అని పేరు. ప్రతిరోజూ ఆ మొక్క ఆకాశాన్ని చూస్తూ, "ఎవరైనా నన్ను గమనిస్తారా? నా అందాన్ని ఎవరికైనా నచ్చుతుందా?" అనే ఆలోచనలో ఉండేది.

రోజులు గడుస్తున్నా, గాలులు వీస్తున్నా, వర్షాలు కురుస్తున్నా... మాలతిని ఎవరూ గమనించలేదు. అది నిశ్శబ్దంగా తన రోజులను గడిపేది.

ఒక రోజు ఆ ఇంటి పైకప్పుపైకి ఒక యువకుడు వచ్చాడు. అతని కళ్ళలో అలసట, మనసులో బాధ కనిపించాయి. అతను అలా నిలబడి ఆకాశాన్ని చూస్తూ ఉండగా, మాలతి తన కొమ్మలను నెమ్మదిగా అతని వైపు వంచింది.


ఆ రోజు నుంచే మాలతిలో మార్పు వచ్చింది. అది పూలతో నిండిపోయి, రంగులతో మెరిసిపోయి, మరింత అందంగా మారింది. ప్రతిరోజూ ఆ యువకుడు వచ్చి మాలతిని చూసేవాడు. అతని ముఖంలో ఒక చిన్న నవ్వు కనిపించేది.

ఆ నవ్వే మాలతికి ఆనందం. అతని సంతోషమే తన జీవితం అనిపించింది.

కానీ ఒక రోజు ఆ యువకుడు రాలేదు. మరుసటి రోజు కూడా అతను కనిపించలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ, మాలతి నెమ్మదిగా వాడిపోవడం ప్రారంభించింది.

అప్పుడు గాలి అడిగింది: "ఎందుకు ఇలా వాడిపోతున్నావు?"

దానికి మాలతి మెల్లగా సమాధానం ఇచ్చింది: "నేను అందంగా పూసింది నా కోసం కాదు... అతను నవ్వాలని మాత్రమే."



సారాంశం (Moral):

కొన్ని పూలు తమ కోసం పూయవు...
ఇతరుల ఆనందం కోసం మాత్రమే జీవిస్తాయి.

రచన : తేరాల రాజేంద్రప్రసాద్
మీసేవ – బాబు జగ్జీవన్ రామ్ నగర్
(గిరినగర్), హైదరాబాద్ – 37
చరవాణి:9297109223

# తమిళనాడులోని... బిల్వవనేశ్వర్ ఆలయం



బిల్వవనేశ్వరర్ దేవాలయం, తిరువైకావూర్ దేవాలయం అని కూడా పిలువబడుతుంది. హిందూ దేవాలయంగా, శివుడుకు అంకితం చేయబడింది. ఇది తమిళనాడు, తంజావూర్ జిల్లాలోని తిరువైకావూరులో ఉత్తరంలో, కొల్లిదాం నది తీరంలో ఉంది. ఇది ద్రావిడ వాస్తు శిల్పం శైలిలో నిర్మించబడినది. 7వ శతాబ్దంలో చోళుల రాజవంశం ద్వారా నిర్మించబడిందని నమ్ముతారు. శివుడు బిల్వవనేశ్వరరుగా, ఆయన సతీమణి పార్వతి వల్లైక్కె నాయకిగా పూజించబడతారు. ఈ దేవాలయం 7వ శతాబ్దపు తమిళ సైవా శాసన గ్రంథం తేవారంలో పేరు పొందినది, దీనిని నయన్మార్లు అనే భక్తి కవి సమూహం రాసారు. ఈ దేవాలయం పాడల్ పేట్ర స్థలంగా వర్గీకరించబడింది. కప్పు రాయి గోడ మొత్తం దేవాలయాన్ని చుట్టి ఉంది. దేవాలయంలో ఐదు మడతల రాజగోపురం ఉంది.

## ఆలయ చరిత్ర:

ఒక సాధువు తవనిధి ఈ దేవాలయంలో పూజ చేస్తుండగా ఒక వేటగాడు వేటాడుతున్న జింకను రక్షించాడు. సాధువు పులిగా మారి వేటాడుతున్న మనిషిని భయపెట్టాడు. భయపడిన వేటాడుతున్న వ్యక్తి దేవాలయంలోని బిల్వ చెట్టులో ఎక్కి పులి వెళ్ళి పోయే వరకు అక్కడ నిలిచాడు. పులి ఇంకా వెళ్లక పోవడంతో, వేటాడుతున్న వ్యక్తి అంత రాత్రి వరకు ఒక్కొక్క బిల్వ ఆకును శివలింగం మీద వేసాడు. ఆ రోజు మహా శివరాత్రి కావడంతో, వేటాడుతున్న వ్యక్తికి శివుడి ఆశీర్వాదం లభించింది. మరుసటి రోజు వేటాడుతున్న వ్యక్తి మరణించే రోజు. యముడు, మృతి దేవుడు, ఆ వ్యక్తి ఆత్మను తీసుకోవడానికి వచ్చాడు. దక్షిణామూర్తి(గురు) తన త్రిశూలం, నందితో యముడిని దేవాలయం నుండి పంపారు. నందిపై శివుడు అసంతృప్తిగా ఉన్నాడు, శివుని ఆగ్రహం నుండి తప్పించుకోవడానికి నంది ఆలయ ప్రవేశ ద్వారం వైపు ముఖం పెట్టింది. ఒక పతివ్రత శాపాన్ని అధిగమించడానికి విష్ణువు ఇక్కడ తపస్సు చేశాడని కూడా నమ్ముతారు – అందుకే ఇక్కడ శివుడిని అరియీశ్వరర్ అని పిలుస్తారు. బ్రహ్మ, అగ్ని ఇక్కడ శివుడిని పూజించడానికి తీర్థం ఏర్పాటు చేశారు. దాని ఫలితంగా బ్రహ్మ, అగ్ని ఇద్దరి శక్తులు వృద్ధి చెందాయి. ఉత్తాల మహర్షి శాపం కారణంగా కోల్పోయిన అష్టసిద్ధులను తిరిగి పొందడానికి సప్తమాతృకలు ఇక్కడ ఉన్న యమ తీర్థం అనే ఆలయ కోనేరులో పవిత్ర స్నానం చేసి శివుడిని పూజించారు. శివుడు, పార్వతి కావేరి నది ఉత్తర ఒడ్డున ఇక్కడ ప్రత్యక్షమయ్యారు. భూమాదేవి శివుడిని పూజించిందని నమ్ముతారు, అందుకే ఈ ప్రదేశాన్ని భూమిపురం అని పిలుస్తారు. శివరాత్రి నాడు ఆభరణాల కోసం ఒక దొంగచే చంపబడిన ఒక బిడ్డ ప్రాణాన్ని శివుడు రక్షించాడు, మకవరులీశ్వరర్ అనే పేరును పొందాడు. మహా ప్రళయం సమయంలో, భూమి నాశనం కాబోతున్నప్పుడు, ప్రపంచం శివుడిని పూజించింది, అప్పుడు ఆయన బిల్వ వృక్ష రూపంలో అవతరించి భూమిని రక్షించారు. అందుకే ఇక్కడి ప్రధాన దైవానికి విల్వవనేశ్వరర్ అనే పేరు వచ్చింది. ఈ ఆలయం కావేరీ నది ఉత్తర ఒడ్డున నిర్మించిన దేవాలయాలలో ఒకటిగా పరిగణించబడుతుంది.

## వాస్తవశిల్పం

బి విల్వనేశ్వరర్ ఆలయం శివునికి అంకితం చేయబడింది, ఇది దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని తిరువైకావూర్ అనే గ్రామంలో ఉంది. సమీప రైల్వే స్టేషన్ కుంభకోణంలో ఉంది, ఇది ఈ ప్రదేశం నుండి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. తిరుచిలో ఉంది. ఈ ఆలయానికి మూడు అంతస్తుల రాజగోపురం, ఒక బాహ్య ప్రాకారం ఉన్నాయి. సాక్షినాథేశ్వరర్ గర్భగుడి రెండవ ప్రాకారంలో ఉంది, అమ్మవారి మందిరం స్వామి వారి మందిరానికి లంబంగాఉంది. నంది విగ్రహం స్వామి వారికి ఎదురుగా ఉంది, దాని వెనుకనే బలిపీఠం, ధ్వజస్తంభం ఉన్నాయి. ఇక్కడ ఒక నటరాజ మండపం, ఒక యాగశాల ఉన్నాయి. నటరాజ, సోమస్కంద, కర్పగ వినాయగర్, నవగ్రహాలకు ప్రత్యేక మందిరాలు ఉన్నాయి. నల్వర్, దక్షిణామూర్తి, అర్ధనారీశ్వరర్, మహాలక్ష్మి, ఆరుముఖం, బ్రహ్మ, దుర్గ, చండికేశ్వరర్లకు కూడా ప్రత్యేక మందిరాలు ఉన్నాయి. ఆలయానికి సంబంధించిన నాలుగు జల వనరులు ఉన్నాయి, వాటిలో యమ తీర్థం ఆలయం ముందు భాగంలో ఉంది. మరణానికి భయపడని జీవి ఏదీ లేదు. ఇక్కడి యమ తీర్థం,యమధర్మరాజు పేరు మీద ఉన్న ఆలయ పుష్కరిణి,మరణ భయాన్ని తగ్గిస్తుంది. ఈ యమతీర్థం తిరుచిలోని తిరునీలివనేశ్వరర్ ఆలయంలో ఉన్నదానిని పోలి ఉంటుంది. దక్షిణామూర్తి శూలాన్ని అంటే త్రిశూలం పట్టుకుని ఉంటాడు. దుర్గా మందిరానికి ఎదురుగా చండికేశ్వరర్ యొక్క రెండు విగ్రహాలు ఉన్నాయి. పురాణ కథకు సంబంధించిన సున్నపు శిల్పం ప్రవేశ ద్వారం వద్ద చెక్కబడింది. విష్ణువు, నారాయణి, భైరవుడు, సూర్యుడు, చంద్రుడు, శని వంటి ఇతర విగ్రహాలు రెండవ ప్రాకారంలో ఉన్నాయి. ఈ ఆలయం తిరుజ్ఞాన సంబంధర్ పద్యాల ద్వారా కీర్తించబడింది.

ఈ ఆలయం గురించి తమిళ సాధువులైన అప్పర్, సుందరర్,సంబంద రచించిన ఏడవ శతాబ్దపు 12 సంపుటాల శైవ ప్రామాణిక గ్రంథం తేవరంలో ప్రస్తావించబడింది. ఇది శైవ గ్రంథాలలో కీర్తించబడిన 275 పాడల్ పెట్ర స్థలాలలో ఒకటి. ఆలయ ఆచారాలు రోజుకు నాలుగు సార్లు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు కల సంధి, మధ్యాహ్నం 12 గంటలకు ఉచ్చి కాలం, సాయంత్రం 6 గంటలకు సాయం రక్షై, రాత్రి 9 గంటలకు అర్ధజామం అనే నాలుగు దశలు ఉంటాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# తొంగి చూస్తుంటారు జాగ్రత్త...??

**మీకు సోషల్ మీడియాలో అకౌంట్ ఉందా.. (ముఖ్యంగా పేస్ బుక్‌లో)**

కొందరు మీ వాల్ చూస్తారు. కామెంట్ పెట్టరు. లైక్ కొట్టరు. కానీ మీరు పెట్టే ప్రతి పోస్ట్ ను తొంగి చూస్తుంటారు. ఆలా తొంగి చూస్తే పర్వాలేదు. కానీ మీరేంటో తెలియకుండా, మీతో మాట్లాకుండా, మీ అభిప్రాయం తెలుసుకోకుండా వారు మీ గురించి ఓ నిర్ణయానికి వస్తుంటారు. ఆలా వచ్చినా పర్వాలేదు. కానీ ఆ విషయాన్ని ప్రచారం చేస్తుంటారు. అటువంటి వారితో జాగ్రత్త సుమీ... ఇంకొందరు ఉంటారు.. వీళ్లకు ఎప్పుడూ ఎదుటి వారి గురించి సమాచారం కావాలి. దానికి కొంత మసాలా జోడించక పోతే వీరికి నిద్ర పట్టదు.

ఉదాహరణకు...
చూశావా... చూశావా..

సుబ్బమ్మకి కోడలు వచ్చి రెండేళ్లు అయింది. ఇంకా ఏ విశేషం లేదు. ఏంటో పాపం.. అసలే వాళ్ళబ్బాయికి పెళ్లి చాలా లేటుగా జరిగింది. అంటూ పక్కింటి మంగమ్మ, వెనకింటి వెంకమ్మతో చెబుతూ ఉంటుంది.

మరొక సంఘటన..
ఏమండీ.. ఇది విన్నారా...

రామయ్య గారికి యాక్సిడెంట్ అయిందంట.. నేను మొన్ననే అనుకున్నా.. వాళ్ళ కొత్త కోడలు అడుగు పెట్టింది... అప్పుడే...

ఇంకొక ఘటన..

ఏరా అబ్బాయి.. నెత్తి మీద జుట్టు ఊడి పోతుంది.. ఇంకా పెళ్లి కాలేదా..

మరొక సంభాషణ...

ఏమ్మా.. మీ పెద్దన్నయ్య ప్రభుత్వ ఉద్యోగిగా.. నీకు ఏమైనా డబ్బులు ఇస్తాడా..

ఇంకో చోట..
ఇలా ఎవరో ఒకరు ఎదుటి వారి గురించి ఎక్కడో ఒక్కచోట మాట్లాడుతూనే ఉంటారు.

నిజంగా ఎదుటి వారి యోగ క్షేమాలు కోరి మాట్లాడితే పర్వాలేదు. కానీ కొందరు పదే పదే తోటి వారి వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తుంటారు. ఆలా చూడటం ద్వారా తోటి వారి ప్రయివసీని దెబ్బ తీస్తుంటారు.

సమాజం అన్నాక ఎవరూ ఒంటరి వారు కారు. ఎవరికుండే బలం వారికుంటుంది. మనం ఉన్నట్లే అందరూ ఉండరు. ఉండలేరు కూడా. ఎవరి జీవితం వారిది.

కొస మెరుపు..


ఈ మధ్య ఓ పెద్దాయన తల్లి దండ్రులను బాగా చూసుకోవాలని నాతో పదే పదే చెబుతున్నాడు. మంచిదేగా అనుకున్నా. కొన్ని రోజులు చూశాక అతని మాటల్లో వెటకారం కన్పించింది. నేను వెంటనే అడిగా..

అవును.. మీరు మీ నాన్న గారిని చూసే విషయంలో వంతులు వేసుకున్నట్లు నాకు బాగా గుర్తు... మరుసటి నిమిషంలో ఆయన అక్కడ లేరు..



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును సత్కరించిన కోనే శ్రీధర్



**నవతరం -శ్రీకాకుళం**

కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యుడు కోనే శ్రీధర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మంత్రిని సత్కరించారు. శనివారం ఉదయం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో దుశ్శాలువ కప్పి, జ్ఞాపిక, పుష్ప గుచ్ఛములతో హిందీ మంచ్ సభ్యులతో కలిసి మంత్రిని శ్రీధర్ సత్కరించారు. కేంద్రమంత్రికి హిందీ ప్రచార సభ డైరీని సభ్యులు బహూకరించారు. ఈ సందర్భంగా కోనే శ్రీధర్ ను మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో హిందీ మంచ్ జిల్లా అధ్యక్షులు కనుగుల సత్యం, ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ STP శిరీష, గౌరవాధ్యక్షులు దొంతం పార్వతీశం, జోనల్ కోశాధికారి ఎం.వి. మల్లేశ్వరరావు, సభ్యులు ఆర్. ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలున్న చోట ఉద్యమాలు సహజం



- అరెస్టులు, నిర్బంధాలతో విప్లవోద్యమం ఆగదు
- కామ్రేడ్ మామిడి అప్పసూరి 29వ వర్ధంతి సభలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్
- నరసన్నపేట మండలం కోమర్తి అమరవీరుల స్థూపం వద్ద స్థూపం వద్ద డెమోక్రసీ శ్రేణుల ఘన నివాళి

**నవతరం-నరసన్నపేట**

భారత విప్లవోద్యమంపైన ఆరు దశాబ్దాలుగా పాలకులు అనేక నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని, ఇటువంటి నిర్బంధాలతో విప్లవోద్యమాన్ని ఆపలేరని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. మండలంలోని కోమర్తి అమరవీరుల స్థూపం వద్ద న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్మారక సభకు ఆయన అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఇవాళ మావోయిజం అంతమైందని పాలకులు ఎంతగా చెప్పుకొంటున్నా, సమాజంలో అసమానతలున్నంతకాలం విప్లవ ఉద్యమాన్ని అణచడం ఎవరి తరమూ కాదని, అసమానతలున్న సమాజంలో ఉద్యమాలు పుట్టుకొస్తుంటాయని ప్రకాష్ అన్నారు. ఒక్కో సందర్భంలో పోరాటం సాయుధ రూపం సైతం తీసుకుంటుందని, నిత్య జీవన సంఘర్షణ నుంచి ప్రతిఘటనా పోరాటాలు సాగుతాయని తాండ్ర ప్రకాష్ పేర్కొన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు మాట్లాడుతూ, అమెరికన్ సామ్రాజ్యవాదం తన పెట్టుబడితో మార్కెట్ విస్తరణ, ఇతర దేశాల సహజ సంపదలను కైవశం చేసుకునేందుకు ఇరాన్‌పై యుద్ధాన్ని నడుపుతుందని, వెనిజులా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిందని, ఇరాన్ అధ్యక్షుడిని కాల్చి చంపిందన్నారు. అమెరికా వివిధ దేశాలపైన దాడులను చేస్తూ ప్రపంచ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుందని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మూడో ప్రపంచ దేశాలు నిలబడాలన్నారు. అమెరికా సాగిస్తోన్న యుద్ధోన్మాదంలో భారత ప్రధాని మోదీ భారతదేశాన్ని భాగస్వామ్యం చేస్తున్నాడని, ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతూ అమెరికా ఆడమన్నట్టు ఆడుతున్నారని, ఈ విధానం అత్యంత ప్రమాదకరమన్నారు. కామ్రేడ్ మామిడి అప్పలసూరి, గుమ్మడి లచ్చయ్య, మామిడి లచ్చెమ్మ ఆశయాలను ముందుకు తీసుకుపోదామని మాధవరావు అన్నారు . జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను ఆయన వివరించారు. ఐఎఫ్టీయూ జిల్లా నాయకురాలు సవళాపురపు కృష్ణవేణి మాట్లాడుతూ, అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళదామని, మనకు వారే ఆదర్శమని అన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నేతింటి నీలంరాజు , ఏఐకేఎంఎస్ సీనియర్ నాయకులు వంకల పాపయ్య, జిల్లా నాయకులు బగ్గు భాస్కరరావు, మామిడి అప్పలసూరి కుటుంబ సభ్యులు, కోమర్తి ప్రజలు పాల్గొన్నారు.

# పలాస జిల్లా సాధనతోనే ఇచ్ఛాపురానికి వంశధార జలాలు సాధ్యం



- నేరడి బ్యారేజ్ నిర్మిస్తే దశాబ్దాల కల సాకారం
- స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు సాగు, త్రాగునీరు ఇవ్వడం లో పాలకులు విఫలం
- జిల్లా సాధించుకునే వరకు పోరాటం ఆగదు
- ప్రముఖ సామాజిక వేత్త, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా)

**నవతరం-పలాస**

కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియలో పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని చెప్పి, చివరి నిమిషంలో ఇచ్చిన మాట తప్పిన తీరుపై పలాస ప్రాంతవాసుల మనోభావాలు దెబ్బతీసినట్లు అయిందని, అంతేకాక వెనుకబాటుతనంతో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పాటు పలాస ప్రాంతానికి వంశధార జలాలు అందివ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపడం శోచనీయమని ప్రముఖ సామాజిక వేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పలాసలో తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచిన గాని, కనీసం ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందడంలో పాలకులు తీవ్ర వివక్షత చూపుతున్నారని దువ్వాడ శ్రీధర్( బాబా) విమర్శించారు. వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణానికి అనుమతిస్తూ వంశధార ట్రిబ్యునల్ 2021 లో తుది తీర్పు ఇచ్చిందని, అదేవిధంగా కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి కి రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు రాసినప్పటికీ, రోజురోజుకు తీవ్ర జాప్యం జాప్యం జరుగుతుంది తప్ప నేరడి వద్ద బ్యారేజ్ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం కూటమి ప్రభుత్వం కేంద్రంలో భాగస్వామ్యంగా ఉండి కూడా నిర్లక్ష్యం చూపడం సబబు కాదన్నారు. నేరడి బ్యారేజ్ వివాదం ఒడిశా తో ఉన్న అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కారం చేసుకోవడంలో ఈ ప్రాంత పాలకులు తగిన రీతిలో ఒత్తిడి తేకపోవడం వల్ల తీవ్ర నిర్లక్ష్యానికి గురికావాల్సివస్తుందన్నారు. చివరి భూములకు వంశధార సాగునీటి జలాలు అందాలంటే వంశధార స్టేజ్-2, ఫేస్ -2 పనులు యుద్ధ ప్రాతిపదిక పైన ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసినప్పుడే ఉద్దానం ప్రాంత రైతులకు న్యాయం జరుగుతుందని దువ్వాడ శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హిరమండలం నుంచి వస్తున్న వంశధార జలాలు కనీసం టెక్కలి నియోజకవర్గం నందిగామ మండలం దాటి రావడంలేదని, ప్రధానంగా కోటబొమ్మాలి, నరసన్నపేట ప్రాంతాలలో నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టారాజ్యంగా ఎత్తిపోతల పథకాలు నిర్మించడంతోపాటు కాలువ లైనింగ్ పనులు అసంపూర్తిగా ఉండటం , రైల్వే మరియు జాతీయ రహదారి క్రాసింగ్ల దగ్గర పనులు పూర్తి కాకపోవడం వంటి సమస్యల వల్ల శివారు భూములకు వంశధార సాగునీరు జలాలు అందకపోవడం వల్ల ఈ ప్రాంత రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోతున్నారని దువ్వాడ శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సాగునీటి వనరులు లేకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు వలసదిపోవడం పరిపాటిగా మారిందని,వలసలు ఆగిపోవాలంటే , స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి తోపాటు సాగునీటి వనరుల లభ్యత చాలా అవసరం అన్నారు. రాష్ట్ర విభజనతో వెలుగుబడిన ప్రాంతాలకు ఇచ్చే ప్యాకేజీ విషయంలో శ్రీకాకుళం జిల్లాలో పలాస ప్రాంతానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. కేంద్రం ఇచ్చే నిధులు మంజూరులో ఇక్కడ వివక్షత కనిపిస్తుందని, పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే అనేక నిధులు న్యాయబద్ధంగా పొందే అవకాశం ఉందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తించి, వారి ఆకాంక్షల మేర జిల్లా ఏర్పాటు అనివార్యమని, పలాస జిల్లా కేంద్రంగా ఏర్పడితే, వంశధార జలాలు ఇచ్చాపురం వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అంతేగాక పారిశ్రామికాభి వృద్ధి సాధ్యపడుతుందని, గత ప్రభుత్వంలోనే మూలపేట పోర్టు పనులు ప్రారంభించబడ్డాయని, తద్వారా భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించడమే కాక, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడే పరిస్థితులు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పలాస కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసేదిశగా తగు నిర్ణయం తీసుకోవాలని, అందుకు తగ్గట్లుగా కార్యచరణ చేయాలని, లేకపోతే ఈ ప్రాంత ప్రజలే మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టడం ఖాయమని దువ్వాడ శ్రీధర్( బాబా) ప్రభుత్వానికి హెచ్చరించారు.

# నిరుద్యోగ యువతకు మోసం చేసిన కూటమి ప్రభుత్వం...

- ఎన్నికల హామీ ఏమైంది మంత్రి నారా లోకేష్...
- లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి...
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ డిమాండ్...




**నవతరం-శ్రీకాకుళం**

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం స్థానిక క్రాంతి భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో యుగంధర్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం లేదా నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైనదని అన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తామని మాట ఇచ్చి పదివేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంటనే ఈ జాబ్ క్యాలెండర్ ను రద్దుచేసి లక్ష ఉద్యోగాలతో నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ కాలంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది అని విమర్శించి తీరా అధికారంలోకి వచ్చిన మూడు నెలలలోపే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన నాయకులు నేడు ఆ మాటలను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశించారు. ఎన్నికల ముందు జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్, ఎన్నికల సభల్లో చంద్రబాబు నాయుడు, అలాగే వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్ యువతకు ఇచ్చిన హామీలు నేటి వరకు అమలుకు నోచుకోక పోవడం సిగ్గు చేటు అని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ నిస్పృహతో కొట్టుమిట్టాడుతూ వారి భవిష్యత్ పై భయాందోళనకు గురిఅవుతున్నారని మరోవైపు రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాలు మరియు డ్రగ్స్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోందని,యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ సమస్యను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. "డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ (జూూ+ూజు) వంటి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశాం" అని చెప్పిన ప్రభుత్వం, ఆ సంస్థ ఎక్కడ పనిచేస్తుంది? ఎలాంటి చర్యలు తీసుకుంది? అనే విషయాల్లో ప్రజలకు స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలోని ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని, గంజాయి మత్తు పదార్థాలు నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు.దశాబ్ద కాలంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు సుమారు 2 లక్షల 30 వేలకుపైగా ఉన్నాయని అయినప్పటికీ ప్రభుత్వం వాటిని భర్తీ చేయడంలో ఉదాసీనత ప్రదర్శిస్తుందని ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీ పోస్టులు ఉన్న పరిస్థితిలో, సంవత్సరానికి కేవలం 10,000 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తామని చెప్పడం ప్రభుత్వానికి నిరుద్యోగ సమస్యపై చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుందని అన్నారు. యువతను పారిశ్రామికవేత్తలుగా మారుస్తాను అని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు గారు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు తీసుకోవచ్చారు ఆ పరిశ్రమల ద్వారా ఎంతమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారో రాష్ట్రము లోని యువతకు చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్ అరవింద్, వసంతరావు, సంతు, వినోద్ తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ప్రజాదర్బార్‌లో సమస్యలకు పరిష్కారం
- రూ.2 లక్షల రూపాయలు పార్టీ తరపున బీమా చెక్కును, ఎన్ లక్ష్మికి అందజేసిన మంత్రి



**నవతరం-నిమ్మాడ**

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. అంతేకాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ వినతులు సమర్పించారు. మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ కాలంలో మంజూరైన గృహ నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన విషయంపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఆగిపోయిన ఇళ్ల పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేస్తే, సంబంధిత బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందని మంత్రి లబ్ధిదారులకు స్పష్టం చేశారు. కోటబొమ్మాలికి చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.2 లక్షలు భీమా చెక్కును మంత్రి చేతుల మీదుగా అందజేశారు . ప్రతి కార్యకర్తకి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం నుంచి త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు వస్తాయని లబ్ధిదారులకు మంత్రి హామీ ఇచ్చారు. కొత్త పింఛన్లు త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల నాయకులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**